సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం । 5 । జూలై । 2024



గంజాయి పట్టివేత
ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 27 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. 10లో▸



రాజకీయాలకు అతీతంగా..
రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. 10లో▸



పేలుడు పదార్థాలు స్వాధీనం
యాచారం మండలం కొత్తపల్లిలోని ఓ వెంచర్‌లో నిల్వఉంచిన పేలుడు సామగ్రిని ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. 10లో▸

ఆందోళనా పథం



మొయినాబాద్: ఓ ప్రైవేటు విద్యా సంస్థను బంద్ చేయిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విద్యార్థి సంఘాల నేతలు ధ్వజమెత్తారు. పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఆత్మీయ వీడ్కోలు



తలకొండపల్లి: ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు సన్మానం

మండల, జిల్లా పరిషత్ సభ్యుల పదవీకాలం ముగిసింది. ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీకాలం బుధవారం ముగియగా, జెడ్పీటీసీల పదవీకాలం గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఇంత కాలం సేవలందించిన సభ్యులకు అధికార యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది.

ఘన నివాళి



కందుకూరు: దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఆయా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

న్యూస్‌రీల్

దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి ఆదర్శం



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ శశాంక తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూస్వామ్యులకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటానికి తొలి అమరత్వాన్ని ఇచ్చి స్ఫూర్తి నింపిన మహోన్నత నాయకుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. వీరుల గాథలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలనే ఉద్దేశంతో జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధికారి నీరజారెడ్డి, ఏఓ నర్సింహారావు, బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్, మహేందర్, బండారు శ్రీశైలం, కృష్ణ, రాజేందర్, పర్వతాలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తాం
మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



డీకే అరుణను సన్మానిస్తున్న నాయకులు

కొత్తూరు: షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండలంలో నిర్మించ తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేయడానికి తనవంతు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న విజయోత్సవ సభకు వెళ్తున్న సందర్భంగా స్థానిక నాయకులు ఆమెకు గురువారం కొత్తూరు పట్టణంలో స్వాగతం పలికారు. ఇందులో భాగంగా ఆమె పట్టణ ముఖ్య కూడలిలో ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో హిందువులను కించపరిచేలా మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వం, బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకమే మరోసారి ప్రధానమంత్రిగా చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఇప్పటికీ వ్యతిరేకత ఉందన్నారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తుతం వాటిని అమలు చేసే పరిస్థితి కనిపించడం లేదని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అందె బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నర్సింహగౌడ్, సదానంద్‌గౌడ్, నాగరాజుచారి, రమేష్, శేఖర్, రణధీర్‌గౌడ్, వెంకటేశ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీచర్ల బదిలీల ప్రక్రియ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం నాటికి 830 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. మరో 955 మందికి స్థాన చలనం కల్పించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో మూడు వేల మందికిపైగా ఉపాధ్యాయులకు స్థానచలనం కలగనుంది. ఇప్పటికే ఆయా ఉపాధ్యాయులంతా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఉపాధ్యాయులను బదిలీ చేస్తున్నారు.

విజయవంతంగా విధులు

ఇద్దరు సీఎంల ఆశీర్వాదం.. తోటి సభ్యుల సహకారం



- సక్సెస్‌ఫుల్‌గా ఐదేళ్లు పూర్తి చేసుకున్నాం
- వచ్చిన ప్రతి పైసాను సద్వినియోగం చేశాం
- అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం
- అవకాశం వస్తే మరోసారి సేవ చేస్తా
- 'సాక్షి'తో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాకున్నా.. విజయవంతంగా విధులు నిర్వర్తించా. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఆశీర్వాదంతో.. తోటి సభ్యుల సహకారంతో ఐదేళ్లు పూర్తి చేసుకున్నా. అవకాశం ఉంటే మళ్లీ సేవలు అందిస్తా. జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా' అని జెడ్పీ చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితారెడ్డి అన్నారు. ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీకాలం బుధవారం ముగియగా, జెడ్పీటీసీల పదవీకాలం గడువు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఐదేళ్ల అనుభవాన్ని పంచుకున్నారు. ఆమె మాటల్లోనే..

నిధుల కొరత వేధించింది
ప్రభుత్వం నుంచి జిల్లా పరిషత్‌కు భారీగా నిధులు సమకూరుతాయని భావించాను. జెడ్పీటీసీగా ఎంతో ఆశించాం. తీరా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సీన్ రివర్స్ అయింది. ఆశించిన విధంగా ఫండ్స్ రాకపోగా, ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీ సెస్ నిలిచిపోయింది. మైనింగ్ అండ్ మినరల్స్ ఫండ్ ఎమ్మెల్యేలకు వెళ్లిపోయింది. దీంతో జెడ్పీకి నిధుల సమస్య తలెత్తింది. జెడ్పీటీసీలు, ఎంపీపీలు నిధుల కోసం ఒత్తిడి తెచ్చేవాళ్లు. వచ్చిన కొద్ది పాటి నిధులను కూడా సమానంగా కేటాయించా. రూ.20 కోట్లు మహిళా శిశు సంక్షేమం కోసం ఖర్చు చేశాం. రూ.35కోట్లతో ఇతర అవసరాలు తీర్చాం. ప్రజల అవసరాలు పూర్తిగా తీర్చలేకపోయామనే బాధ ఇప్పటికీ వేధిస్తోంది. వారు అడిగిన పనులు చేయించలేక పోయామనే ఆవేదన వెంటాడుతోంది.

పాఠశాలలపై అజమాయిషీ లేక
గత ప్రభుత్వం మా అధికారాలకు కత్తెర వేసింది. ప్రభుత్వ పాఠశాలలపై అజమాయిషీ లేకుండా చేసింది. ఫలితంగా పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. కళ్లతో చూస్తూ కూడా ఏమీ చేయలేక పోయాం. మన ఊరు మనబడి పథకం ద్వారా కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ.. మెజార్టీ ఉపయోగంలో లేవు. రన్నింగ్ వాటర్ లేదు. పారిశుద్ధ్య లోపంతో కట్టినవి కూడా ఉపయోగించుకోలేని పరిస్థితి. జెడ్పీ సమావేశాల్లో సభ్యులంతా ఇదే అంశంపై ఆవేదన వెళ్లగక్కేవాళ్లు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. జెడ్పీ నిధుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మరుగు దొడ్లు నిర్మించాలని కోరాం. ఆ నిధులను కూడా వినియోగించుకోలేక పోయింది. రైతు బంధు, దళిత బంధు, రకరకాల పథకాల పేరుతో కోటీశ్వరులు, భూస్వాములు, ఉన్నతోద్యోగుల ఖాతాల్లో డబ్బులు వేసిన గత ప్రభుత్వం.. ప్రభుత్వ స్కూళ్లలో స్కావేంజర్లను నియమించాలని కోరినా పట్టించుకోలేదు.

> నిధులు లేకుండా ఐదేళ్లు విధులు నిర్వర్తించాం. నిధుల కేటాయింపు, అభివృద్ధి పనుల్లో వివక్ష, అక్రమాలు, అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేకుండా ఐదేళ్లు జెడ్పీ చైర్‌పర్సన్‌గా విధులు నిర్వర్తించాం. మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని అనేక గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శ
>
> **వివక్ష, అక్రమాలు లేకుండా..**
>
> గ్రామాలుగా తీర్చిదిద్దాం. కొంత వరకు వారి రుణం తీర్చుకోగలిగాను. గత, ప్రస్తుత ప్రభుత్వాల్లోని పెద్దలు, అధికారుల సహకారంతో ఐదేళ్లు విజయవంతంగా పని చేశాను. మళ్లీ జెడ్పీటీసీగా పోటీ చేస్తా. ప్రజలు మరోసారి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నా.

వైద్య వృత్తి నుంచి..
వృత్తిరీత్యా గైనకాలజిస్టుని. ఓ వైద్యురాలిగా 20 ఏళ్లలో ఎంతో మందికి ప్రసవాలు చేసిన అనుభవమే కాదు.. కుటుంబ నియంత్రణ, వాటి పునరుద్ధరణ వంటి చికిత్సలు చేశాను. పురిటి నొప్పులు, అధిక రక్తస్రావం, ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి ఓదార్పు ఇచ్చేదాన్ని. అత్యవసర పరిస్థితుల్లో రోగుల మధ్యే ఎక్కువ సమయం గడిపేదాన్ని. నిత్యం రోగుల మధ్యే గడిపే నేను..అనుకోకుండా రాజకీయాల్లోకి వచ్చాను. అప్పటికే మా మామయ్య తీగల కృష్ణారెడ్డి నగర మేయర్‌గా, మాజీ ఎమ్మెల్యేగా పని చేశారు. ఆయన సహకారంతో రాజకీయాల్లోకి వచ్చాను. మహేశ్వరం నుంచి జెడ్పీటీసీగా గెలుపొందాను. జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యాను. మొదట్లో కొంత భయపడేదాన్ని. తర్వాత అన్నీ అలవాటు చేసుకున్నా. ఒకవైపు క్లినిక్‌కు వచ్చిన రోగులకు సేవలు అందిస్తూనే.. మరోవైపు వివిధ సమస్యల పరిష్కారం కోసం జెడ్పీకి వచ్చే వారికి అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశాను.

విసిగి వేసారి.. హతమార్చి

- ప్రాణం తీసిన కుటుంబ కలహాలు
- తల్లితో కలిసి భర్తను కొట్టి చంపిన భార్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కందుకూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య తన తల్లితో కలిసి భర్తను హతమార్చింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లికి చెందిన కంచుకట్ల పరమేశ్(37) మొదటి భార్య మృతి చెందడంతో మండలంలోని కొత్తగూడకు చెందిన చుక్కమ్మ కుమార్తె స్వప్నను 12 ఏళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పరమేశ్ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ హైదరాబాద్ అల్మాస్‌గూడలో నివసిస్తున్నారు. కాగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో స్వప్న మూడేళ్ల క్రితం పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చింది. పరమేశ్ తరచూ మద్యం తాగి కొత్తగూడకు వచ్చి భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈవిషయంలో పలుమార్లు పెద్దల వద్ద పంచాయితీతో పెట్టడంతోపాటు పోలీసులకు సైతం స్వప్న ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి మరోసారి మద్యం తాగి భార్య వద్దకు వచ్చిన పరమేశ్ ఆమెతో గొడవకు దిగాడు. దీంతో విసుగు చెందిన స్వప్న.. తన తల్లి చుక్కమ్మతో కలిసి కర్రలతో పరమేశ్‌ను కొట్టి చంపింది. మృతదేహాన్ని కొంత దూరంలోని ప్రభుత్వ పాఠశాల వెనక పక్కన ఓ వ్యవసాయ క్షేత్రంలో పడేసి వెళ్లారు. గురువారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్వప్న, చుక్కమ్మను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రావణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా తండ్రి మరణించడం, తల్లి, అమ్మమ్మ జైలుకు వెళ్లనుండటంతో ఇద్దరు పిల్లలు అక్షయ(7), లిఖిత(5) అనాథలయ్యారు. అక్షయ ఒకటో తరగతి, లిఖిత అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్నారు. వీరి ఆలనా పాలనా ఎవరు చూసుకుంటారో ప్రశ్నార్థకంగా మారింది.

నిధులు లేక.. పనులు సాగక!

- పంచాయతీల్లో పడకేసిన పాలన
- నిలిచిపోయిన కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు
- అభివృద్ధి పనులకు తప్పని ఆటంకం
- తల పట్టుకుంటున్న కార్యదర్శులు



షాబాద్: గ్రామ పంచాయతీలను నిధుల కొరత వెంటాడుతోంది. ఫలితంగా పాలన పడకేసింది. పెద్ద పంచాయతీల పరిస్థితి ఎలా ఉన్నా.. ఆదాయ వనరులు అంతగా లేని చిన్న పంచాయతీల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. అభివృద్ధి పనులకు నిధులు లేక కార్యదర్శులు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. జిల్లాలో 558 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొన్ని నెలలుగా 15వ ఆర్థిక సంఘం నిధులు, రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు రాలేదు. ఫలితంగా వీధిదీపాలు, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్లకు డీజిల్, సిబ్బంది, కార్మికుల వేతనాలు, తాగునీటి మోటార్ల మరమ్మతు పనులు ముందుకు సాగడం లేదు. పెద్ద పంచాయతీలకు కొంతలోకొంత ఆదాయం వస్తుండడంతో ఎలాగోలా నెట్టుకొస్తున్నాయి. చిన్న పంచాయతీల్లో మాత్రం పాలన స్తంభించింది. పలు పనుల విషయమై ఇటు ప్రజలు, వేతనాల విషయంలో కార్మికులు, బిల్లుల చెల్లింపుల విషయంలో ఇతరులకు సమాధానం చెప్పలేకపోతున్నామని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సొంత డబ్బులు వెచ్చిస్తూ..
కొన్ని గ్రామాల్లో పలు అవసరాలకు పంచాయతీ కార్యదర్శులే సొంతంగా డబ్బులు వెచ్చించి పనులు చేయిస్తున్నట్లు తెలిసింది. ఏదైనా మరమ్మతు గానీ, వీధిదీపాలు, ఇతర అవసరాలకు జేబు నుంచి ఖర్చు పెడుతున్నారు. ప్రస్తుతం వర్షకాలం ప్రారంభమైంది. ఇప్పటికే ఉన్నతాధికారులు పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఈ పరిస్థితుల్లో నిధుల కొరత కార్యదర్శులకు సమస్యగా మారింది. పంచాయతీల్లో నిధులలేమిపై ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భారం పడకుండా చూడాలి
నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి అనేక సమస్యలు పరిష్కరిస్తున్నాం. పనిభారంతో పాటు ఆర్థికభారం మోపడం సరికాదు. పెండింగ్ బిల్లులు మంజూరు కాలేదు. సత్వరమే వాటిని విడుదల చేయాలి.

– అనిత, పంచాయతీ కార్యదర్శి, షాబాద్

నిధులు మంజూరు చేయాలి
గ్రామ పాలనకు ఆటంకం కలగొద్దని ఒక్కో కార్యదర్శి లక్షలు ఖర్చు చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసి ఒత్తిడి తగ్గించాలి. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.

– అశోక్, పంచాయతీ కార్యదర్శి, పోతుగల్

ఆహార కల్తీతో ప్రజారోగ్యానికి ముప్పు
రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ శంకర్‌లాలా

షాద్‌నగర్: రోజురోజుకూ ఆహార కల్తీ పెరిగిపోతోందని, కలుషితమైన ఆహారంతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ శంకర్‌లాలా ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆహార కల్తీ, కొత్త చట్టాలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరన శంకర్‌లాలా మాట్లాడుతూ.. కలుషితమైన ఆహారంతో నిత్యం ఎంతో మంది తీవ్రమైన అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. వీరిలో కొంతమంది పరిస్థితి చేయిదాటడంతో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ ప్రజల జీవన శైలి మారుతోందని, తదనుగుణంగా ఆహార అలవాట్లు కూడా మారుతున్నాయని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండటంతో సరుకులు అమ్మే దుకాణాదారుల మధ్య పోటీ పెరిగిందని, దీంతో కొందరు కల్తీకి పాల్పడుతూ తక్కువ ధరకే విక్రయిస్తున్నారని అన్నారు. చాలామంది సిద్ధం చేసిన ఆహారం వైపు ఆకర్షితులవుతున్నారని, అయితే ఆహార పదార్థాల తయారీలో రుచి, రంగు కోసం వ్యాపారులు హానికరమైన రసాయనాల రంగులను ఉపయోగిస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఆహార నాణ్యతపై అందరూ ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని సూచించారు.

మహా మార్పు

హెచ్‌ఎండీఏలో బదిలీలకు రంగం సిద్ధం
- ఏళ్లుగా పాతుకుపోయిన వారికి స్థానచలం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏలో బదిలీలకు రంగం సిద్ధమైంది. వివిధ విభాగాల్లో రెండేళ్ల కంటే ఎక్కువ కాలంగా పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేసే అవకాశం ఉంది. అన్ని ప్రభుత్వ విభాగాల్లో సాధారణ బదిలీలకు ప్రభుత్వం అనుమతినిచ్చిన నేపథ్యంలో హెచ్‌ఎండీఏలో బదిలీల అంశం తాజాగా చర్చనీయాంశంగా మారింది. ఏళ్లుగా ఒకే చోట పాతుకుపోయిన కొందరు అధికారుల వ్యవహారశైలి, పనితీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా దానకిశోర్ విధులు నిర్వహించిన సమయంలోనే బదిలీల అంశం ప్రస్తావకు వచ్చింది. ప్లానింగ్ విభాగాన్ని విస్తరించి, బలోపేతం చేయాలని కూడా అధికారులు ప్రతిపాదించారు. ఈ మేరకు కార్యాచరణ కూడా చేపట్టారు. ఈలోపు దానకిశోర్ స్థానంలో హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలను చేపట్టారు. కొద్ది రోజులుగా ఆయన వివిధ విభాగాల పనితీరును సమీక్షిస్తున్నారు. అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఆయా విభాగాల కార్యకలాపాలను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అంతర్గతంగా వివిధ విభాగాల్లో ఎక్కువ కాలంగా పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులను బదిలీ చేసి పనితీరును మెరుగుపర్చుకోవాలని అధికారవర్గాలు భావిస్తున్నాయి.

అక్రమాలపై ఆరోపణలు రావడంతో..
హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో ఎంతో క్రియాశీలంగా పని చేసినప్పటికీ కొద్దిమంది పనితీరు హెచ్‌ఎండీఏకు ఇబ్బందిగా మారుతోంది. నాలుగైదేళ్లుగా ఒకేచోట పని చేస్తున్న కొందరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు గతప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన కొందరు అధికారులకు కింది స్థాయిలో అన్ని విధాలా అనుచరులుగా వ్యవహరించిన వారు ఇప్పటికీ అదే స్థానాల్లో కొనసాగడం కూడా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తాజా బదిలీల్లో ఇలాంటి వారికి కూడా స్థానచలం ఉంటుందని అధికారవర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం హెచ్‌ఎండీఏలోని వివిధ విభాగాల్లో బదిలీల అంశమే హాట్‌టాపిక్‌గా మారింది.



ప్లానింగ్ విభాగంలో భారీగా..
- లే అవుట్లు, నిర్మాణరంగ అనుమతులు, హైరైజ్ భవనాలు, బహుళ అంతస్తుల భవనాల అనుమతుల్లో కీలకమైన ప్రణాళికా విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేయాలనే ప్రతిపాదన ఉంది. కొంతమంది అధికారులు, ఉద్యోగుల పని తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సకాలంలో ఫైళ్ల పరిష్కారం కాకపోవడం, పెద్ద సంఖ్యలో పెండింగ్ జాబితాలో పడిపోవడం వంటి అంశాలను ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణిస్తున్నారు. విధుల నిర్వహణలో అలసత్వాన్ని, జాప్యాన్ని ప్రదర్శించేవారికి ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానచలనం కల్పించాలని అధికారులు భావిస్తున్నారు. శంషాబాద్, శంకర్‌పల్లి, ఘట్‌కేసర్, మేడ్చల్ నాలుగు జోన్‌లలో పని చేస్తున్న కొంతమంది జేపీఓలు, ఏపీఓల పనితీరుపై పై స్థాయిలో తీవ్రమైన అసంతృప్తి ఉంది.
- మరోవైపు సకాలంలో ఫైళ్ల పరిష్కారానికి నోచకపోవడంతో నెలల తరబడి హెచ్‌ఎండీఏ చుట్టూ తిరగాల్సిన వస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుత బదిలీల్లో ఇలాంటి అధికారుల వ్యవహారశైలిని తీవ్రంగా పరిగణించే అవకాశం ఉంది. మరోవైపు ఎస్టేట్ విభాగంలో కూడా ఎక్కువ రోజులుగా పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులకు సైతం ప్రస్తుతం సాధారణ బదిలీల్లో భాగంగా స్థానచలం ఉండే అవకాశం ఉంది. మరోవైపు ప్లానింగ్ విభాగాన్ని నాలుగు జోన్‌ల నుంచి 6 లేదా 8 జోన్‌లకు విస్తరించే ప్రతిపాదన కూడా ఉండటంతో అదనపు సిబ్బంది నియామకంపై అధికారులు దృష్టి సారించారు.

రికవరీ ఫోన్ల అప్పగింత


బాధితులకు సెల్‌ఫోన్లు అందజేసిన పోలీసులు

మంచాల: మండలంలో గతంలో పోయిన సెల్‌ఫోన్లను మంచాల పోలీసులు రికవరీ చేసి గురువారం బాధితులకు అప్పగించారు. సీఐ బాబ్యానాయక్ కథకం ప్రకారం.. ఠాణా పరిధిలో 35 సెల్ ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిలో ఎనిమిది ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. మిగతా వారివి కూడా గుర్తించి సకాలంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై రవినాయక్, ఏఎస్సై సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

ఇద్దరిపై కేసు నమోదు


పట్టుబడిన డిటోనేటర్లు, జిలెటిన్‌స్టిక్స్

యాచారం: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో ఓ వెంచర్‌లో బండరాళ్లను పేల్చడానికి తెచ్చి నిల్వఉంచిన పేలుడు సామగ్రిని బుధవారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన రవి, వెంకటయ్యలు అక్రమంగా రహస్య ప్రదేశంలో 19 డిటోనేటర్లు, 68 జిలెటిన్‌స్టిక్స్ పేలుడు సామగ్రిని నిల్వ ఉంచారు. సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రవి, వెంకటయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

చెరువులో మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో గుర్తుతెలియని శవాన్ని గురువారం వెలికితీశారు. స్థానిక ఎస్ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పెద్ద చెరువులో 55 నుంచి 60 సంవత్సరాల లోపున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేశాన్ని బయటకు తీశారు. మృతుడు తెలుపు రంగు షర్ట్, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. శవాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వాళ్లు 87126 62361 సంప్రదించాలని పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, చిత్రంలో ఎంపీ మల్లు రవి

మాడ్గుల: మండలంలో వివిధ అభివద్ధి పనులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవితో కలిసి గురువారం ప్రారంభించారు. బ్రాహ్మణపల్లిలో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీలు అప్పారెడ్డిపల్లిలో కుర్మ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి వీడ్కోలు కార్యక్రమంలో ఇరువురూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ.. నిస్వార్థంగా సేవలు అందించిన ప్రజా ప్రతినిధులకు గౌరవం ఉంటుందన్నారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామన్నారు. నియోజకవర్గంలో వంద ఎకరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.విద్యా, వైద్య రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అనంతరం పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డిని నాయకులు ఘనంగా సత్కరించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ..తమపదవీకాలంలో మాడ్గుల అభివృద్ధే లక్ష్యంగా పని చేశా మన్నారు.కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శీనివాస్‌రెడ్డి, నాయకులు సంపత్, దళపతి, రమేష్‌గౌడ్, రాములు పాల్గొన్నారు.

హిందువులపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు సరికాదు


చేవెళ్లలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చేవెళ్ల: లోక్‌సభలో రాహుల్‌గాంధీ హిందూవుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడటం సరైనది కాదని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా చేవెళ్లలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ వైఖరి ఎప్పుడు హిందూవులకు వ్యతిరేకంగా, దేశ సంస్కృతిని అవహేళన చేసే విధంగా ఉంటుందని విమర్శించారు. ఈ దేశంలోని హిందూవులంతా కాంగ్రెస్ వైఖరిని గమనిస్తున్నారని, త్వరలోనే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ వైఖరి మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వైభవ్‌రెడ్డి, అడ్డెట్ల శ్రీనివాస్, కుంచం శ్రీనివాస్, వెంకట్రామిరెడ్డి, దేవుని శర్వలింగం, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ, రాజు, చందర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, చాకలి శ్రీనివాస్, కృష్ణ, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

27 కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి నగరానికి తరలిస్తుండగా పోలీసుల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

అబ్దుల్లాపూర్‌మెట్: ఒడిశా నుంచి నగరానికి గంజాయిని తరలిస్తున్న ఓ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 27 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్న సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్‌ఆర్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారులో కొంతమంది అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు కారు లోపలి భాగంలో సోదాలు చేయగా 36 ప్యాకెట్లతో ఉన్న సుమారు 27 కిలోల గంజాయి బయటపడింది. కారులో ఉన్న వారిని విచారించగా ఒడిశా రాష్ట్రం నుంచి నగరానికి సరఫరా చేస్తున్నట్లు అంగీకరించడంతో బలరాం తాళి(23), రాజు కపస్య(20), విజయ హాల్దార్(22)లతోపాటు కారు యజమాని కొడుకు మైనర్(13)ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గంజాయితో పాటు ఓ కారు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

షాద్‌నగర్‌రూరల్: సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గురువారం ప్రయాణికులకు కొత్త చట్టాలపై, సైబర్ నేరాలు, డ్రగ్స్, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. కొత్తగా వచ్చిన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కొత్త చట్టాల ప్రకారం నేరం చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. గుర్తు తెలియని, కొత్త వ్యక్తులు మీ వద్దకు వచ్చి మాట్లాడే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు, యువత ఆన్‌లైన్ గేమ్‌లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, తల్లితండ్రుల పట్ల గౌరవంగా నడుచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నబంధనలను పాటించి వాహనాలను నడపాలన్నారు. ఎక్కడ దొంగతనాలు జరిగినా, కొత్తగా అపరిచిత వ్యక్తులు కనిపించినా వెంటనే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నా పేరిట డబ్బులు అడిగితే నమ్మొద్దు'

లక్డీకాపూల్: 'సోషల్ మీడయాలో నా ఫొటో పెట్టుకుని కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారు. వాటిని నమ్మవద్దు'అని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప పేర్కొన్నారు.తన ఫొటోతో డబ్బులు అడుగుతూ గుర్తుతెలియని వ్యక్తులు చేస్తున్న కాల్స్, మేసెజీల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నాలుగురోజుల క్రితమే పంజగుట్ట పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గురువారం సీసీఎస్‌లో కూడా ఫిర్యాదు చేశానన్నారు. అడుగుతున్న సంఘటనలు ఎదురైతే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

గృహిణి అదృశ్యంపై కేసు నమోదు


అఖిల (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన ఒరుసుల మన్నెన్, అఖిల(22)లు భార్యాభర్తలు. ఆరేళ్ల క్రితం వివాహం జరిగిన వీరికి ఒక బాబు ఉన్నారు. ఇటీవల అఖిల ఇతరులతో ఫోన్ మాట్లాడుతుండడాన్ని గమనించిన మన్నెన్ గత నెల 30వ తేదీన మందలించారు. ఇది మనసులో పెట్టుకున్న అఖిల ఈ నెల 2న తన కుమారుడితో కలిసి బయటికి వెళ్లిపోయింది. వెంకటేష్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ మన్నెన్ గురువారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలో ఓ వృద్ధుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానిక సీఐ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి పట్టణ శివారులోని పి.ఇంద్రారెడ్డి మినీ స్టేడియంలో రెండు గదులు ఉండగా.. ఒక దాంట్లో భీమయ్య(65) నివసిస్తున్నారు. గతంలో మున్సిపల్ కార్మికుడిగా పని చేశారు. 60 ఏళ్లు పైబడడంతో నిబంధనల ప్రకారం ఉద్యోగం నుంచి తీసేశారు. దీంతో అప్పటి నుంచి పట్టణంలో కాగితాలు, దొరికిన దగ్గర భోజనం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. భీమయ్య కూతురు నాలుగు క్రితం మృతి చెందారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మద్యానికి బానిసయ్యారు. మినీ స్టేడియానికి సమీపంలో రెండు పడకల ఇళ్లలో సెక్యూరిటీగా పని చేసే సుగార్‌సింగ్, భీమయ్య నిత్యం ఉదయం వేళ టీ తాగేవారు. గురువారం మధ్యాహ్నం అవుతున్న రాకపోయే సరికి సుగార్‌సింగ్ వెళ్లి భీమయ్య గదిని పరిశీలించారు. తలుపులు తెరిచి ఉండి చేతిలో కత్తి, గొంతుపై బలమైన రక్త గాయాలతో భీమయ్య పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. చేతిలో కత్తి, గొంతుపై గాయం ఉండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సఖి సెంటర్‌కు మతిస్థిమితం లేని గర్భిణి


వాహనంలో గర్భిణిని పంపిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులు, స్థానికులు

చేవెళ్ల: మతిస్థిమితం లేని నిండు గర్భిణి అధికారుల చొరవతో సఖి కేంద్రానికి చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి.. కొద్ది రోజుల క్రితం ఓ గుర్తుతెలియని మహిళ ఎన్కేపల్లిలో ప్రత్యక్షమైంది. ఆమె ఎక్కడి నుంచి వచ్చిందో.. ఎలా వచ్చిందో ఎవరికీ తెలియదు. ఆమె మాట్లాడే భాష కూడా ఎవరికీ అర్థం కావడం లేదు. ఇది గమనించిన స్థానికులు విషయాన్ని అంగన్‌వాడీ టీచర్‌కు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల దృష్టికి తీసుకెళ్లారు. వారు వచ్చి వివరాలు సేకరించే ప్రయత్నం చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. సదరు మహిళ తొమ్మిది నెలల గర్భంతో ఉన్నట్లు గుర్తించిన సిబ్బంది.. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన అధికారి నగరంలోని సఖి కేంద్రానికి ఫోన్ చేసి గర్భిణిని తీసుకెళ్లాలని కోరారు. సఖి సెంటర్ నుంచి వచ్చిన వ్యాన్‌లో మహిళను నగరానికి పంపించారు. గర్భిణిని సురక్షితంగా పంపించిన అధికారులు, పోలీసులపై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

హష్ ఆయిల్ ముఠా అరెస్ట్

గన్‌ఫౌండ్రీ: తక్కువ సమయంలో సులువుగా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దుర్బుద్ధితో ముగ్గురు యువకులు పక్కదారి పట్టారు. నిషేధిత మాదక ద్రవ్యాలను రవాణా చేస్తూ గురువారం పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల నుంచి 1.2 కిలోల హష్ ఆయిల్, ద్విచక్ర వాహనం, నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బేగంబజార్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొర్రబాబు(30), దమ్మాయిగూడకు చెందిన చందన్ కుమార్ చౌదరి(34), ఎం.ధన్‌రాజ్(27) ముఠాగా ఏర్పడ్డారు. తక్కువ సమయంలో సులభంగా డబ్బులు సంపాదించాలనే దురాలోచనతో ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన నిషేధిత హష్ ఆయిల్‌ను రహస్యంగా నగరానికి తీసుకువచ్చి వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ పోలీసుల కళ్లు కప్పి తప్పించుకు తిరుగుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో సౌత్, వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, బేగంబజార్ పోలీసులు సంయుక్తంగా నాంపల్లిలోని భీమ్‌రావు బస్తీలో నిఘా పెట్టారు. నిందితులు ద్విచక్ర వాహనంపై హ్యాష్ ఆయిల్‌ను తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశారు. మరింత దర్యాప్తు కోసం కేసు నమోదు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో హష్ ఆయిల్ వాడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు, నిషేధిత ఉత్పత్తులను వాడుతున్నట్లయితే తక్షణమే పోలీసులకు తెలపాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా చూసేందుకు వారి కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు.

పెళ్లి పేరిట నమ్మించి.. కోటిన్నర కొట్టేసి..!

- మ్యాట్రిమోనీలో నకిలీ ప్రొఫైల్.. అమ్మాయిలకు వల
- చివరికి పోలీసులకు చిక్కిన కేటుగాడు

సాక్షి, సిటీబ్యూరో: రూ.350 కోట్ల బ్యాంకు బ్యాలెన్స్ ఉందని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు.. విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని, బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని మాయ మాటలు చెప్పాడు.. నమ్మిన ఓ బాధితురాలి నుంచి రూ.కోటిన్నర కొట్టేశాడు.. చివరికి సైబర్ క్రైమ్ పోలీసులకు చిక్కాడు ఓ కేటుగాడు. ఏసీపీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ సైబర్ కేటుగాడికి పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారు. విలాస జీవితానికి అలవాటు పడి భార్యను వదిలేసి హైదరాబాద్‌కు మకాం మార్చాడు. తనకు రూ.కోట్లాది ఆస్తి ఉందని, తల్లిదండ్రులు ఎవరూ లేరని, ఒంటరిగా అమెరికాలో ఉంటున్నానని అమ్మాయిలకు మాయమాటలు చెప్పి నమ్మించేవాడు. ఆస్టన్ మార్టిన్ కారు ముందు లగ్జరీ సూటు, బూటుతో హీరో మాదిరిగా స్టయిల్‌గా ఫొటోలను మార్ఫింగ్ చేసి, మ్యాట్రిమోనీలలో నకిలీ ప్రొఫైల్ సృష్టించాడు. ఏపీకి చెందిన ముగ్గురు అమ్మాయిలకు వాటిని పంపించాడు. ఒకరికి తెలియకుండా మరొకరితో ప్రతిరోజూ ఫోన్‌లో మాట్లాడేవాడు. హైదరాబాద్‌లో ఉంటూనే విదేశీ నంబర్లతో ఫోన్లు చేసేవాడు. పుట్టిన రోజులు, ఇతరత్రా ప్రత్యేక దినాలకు ఖరీదైన బహుమతులు పంపించేవాడు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు వస్తున్నానని, పెళ్లి చేసుకుందామని నమ్మబలికాడు. విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని, తన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారని చెప్పాడు. నమ్మిన ఓ బాధితురాలు పెళ్లి కోసమని బ్యాంకు అకౌంట్లో దాచుకున్న రూ.కోటిన్నరను దశలవారీగా వసూలు చేశాడు. ఆ తర్వాత ఆమెతో మాట్లాడటం మానేశాడు. ఎంతకీ అతని నుంచి ఫోన్ రాకపోయే సరికి బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

ఓవర్‌టేక్ చేశాడని యువకుడి వీరంగం

మద్యం మత్తులో ఇద్దరిపై దాడి

మీర్‌పేట: ఓవర్‌టేక్ చేసినందుకు మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం చేశాడు. అతడు ఇద్దరిపై దాడికి పాల్పడిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బాలాపూర్‌కు చెందిన యశ్వంత్‌రెడ్డి స్నేహితులతో కలిసి కారులో గురువారం ఆర్‌సీఐ రోడ్డులో వెళ్తున్నారు. స్విమ్మింగ్‌పూల్ వద్దకు రాగానే సికింద్రాబాద్ వైపు కారులో వెళ్తున్న సాయికుమార్ అనే యువకుడు యశ్వంత్‌రెడ్డి కారును ఓవర్‌టేక్ చేశారు. దీంతో మద్యం మత్తులో ఉన్న యశ్వంత్‌రెడ్డి తన కారుకు తాకిందని ఆగ్రహంతో సాయికుమార్‌తో పాటు మరో యువకుడిపై దాడికి పాల్పడ్డారు. యశ్వంత్ రెడ్డి తన కారుకు ఎమ్మెల్యే స్టిక్కర్ పెట్టుకోవడంతో పాటు కారులో మద్యం బాటిల్ కూడా ఉందని, క్షమాపణ చెప్పినప్పటికీ వినిపించుకోకుండా తమపై దాడికి పాల్పడినట్లు బాధిత యువకులు వాపోయారు. ఈ మేరకు బాధితులు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో..

రాంగోపాల్‌పేట్: రోడ్డు పక్కన యాచిస్తున్న ఓ చిన్నారిని కిడ్నాప్ చేసిన ఇద్దరిని మోండా మార్కెట్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మహారాష్ట్రకు చెందిన బాలిక గత నెల 26న అదృశ్యమైంది. దీంతో కారకులను పోలీసులు అరెస్టు చేశారు.

నాంపల్లి కోర్టుకు మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు

బంజారాహిల్స్(హైదరాబాద్): టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం నాంపల్లిలోని 17వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. 2018లో చెన్నుపాటి వేణుమాధవ్‌కు చెందిన క్రియా హెల్త్‌కేర్ లిమిటెడ్ సంస్థలో తలెత్తిన భాగస్వామ్య వివాదాన్ని పరిష్కరించడానికి రాధాకిషన్‌రావు రంగంలోకి దిగారు. తనను కిడ్నాప్ చేసి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తీసుకెళ్లారని, బలవంతంగా సంస్థకు చెందిన షేర్ల బదలాయింపు చేసి చంద్రశేఖర్ వేగే, సినీ నిర్మాత నవీన్ ఎర్నేని సూరెడ్డి గోపాలకృష్ణ, మందల రవికుమార్‌కు ప్రయోజనం కల్పించారంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో వేణుమాధవ్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాధాకిషన్‌రావుతోపాటు ఇతర నిందితులపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు రాధాకిషన్‌రావు ప్రస్తుతం ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్ట్ అయి జైలులో ఉన్నారు. కాగా, ఆయన్ను షేర్ల బదలాయింపు కేసులో పీటీ వారెంట్ ద్వారా గురువారం కోర్టులో హాజరుపరిచారు. రాధాకిషన్ రావుకు 14 రోజుల కస్టడీ విధించడంతో తిరిగి జైలుకు పంపించారు. కాగా, ఒకటి రెండు రోజుల్లో జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీ పిటిషన్ వేసి ఈ కేసులో రాధాకిషన్‌రావును విచారించేందుకు సిద్ధమవుతున్నారు.

కండక్టర్ చాకచక్యం.. డ్రైవర్ అప్రమత్తం..!

ప్రయాణికురాలు పోగొట్టుకున్న రూ.3 లక్షలు తిరిగి అప్పగింత


మహిళ పోగొట్టుకున్న రూ.3 లక్షలను తిరిగి ఇస్తున్న ఆర్టీసీ కండక్టర్ చిరంజీవి

జీడిమెట్ల: ఆర్టీసీ బస్సు కండక్టర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ఓ మహిళ ప్రయాణికురాలు పోగొట్టుకున్న రూ.3 లక్షల డబ్బులు దొరికాయి. వివరాలు.. జీడిమెట్ల డిపో బస్సు మెహిదీపట్నం నుంచి జీడిమెట్లకు వస్తోంది. ఈ క్రమంలో మూసాపేట వద్ద కొంతమంది మహిళా ప్రయాణికులు బస్సు ఎక్కారు. బస్సు మూసాపేటకు చేరుకోగానే ఓ మహిళ తన బ్యాగులో ఉన్న డబ్బు పోయిందని కండక్టర్ చిరంజీవికి తెలిపింది. వెంటనే అతడు డ్రైవర్ మల్లికార్జున్‌ను అప్రమత్తం చేయడంతో బస్సును ఎక్కడా ఆపకుండా పోలీస్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లాడు. వెంటనే పోలీసులు బస్సులో ఎక్కి ప్రయాణికులను తనిఖీ చేశారు. బస్సులో దొరికిన బ్యాగ్‌ను ఓ ప్రయాణికుడు తన వద్దే పెట్టుకున్నాడు. పోలీసులకు ఆ వ్యక్తి బ్యాగ్ ఇచ్చాడు. అందులో రూ.3 లక్షలు అలాగే ఉండటంతో ఆ బ్యాగ్‌ను అప్పగించారు.

నకిలీమందుల తయారీదారుల అరెస్టు

- రూ.50 లక్షల సామగ్రి స్వాధీనం
- మేడ్చల్ జిల్లా దూలపల్లిలో ఘటన


వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి


స్వాధీనం చేసుకున్న నకిలీ మందులు

కుత్బుల్లాపూర్: నకిలీ మందుల తయారీ కేంద్రంపై పోలీసులు, డ్రగ్స్ కంట్రోల్ బోర్డు అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.50 లక్షల విలువ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, డ్రగ్ కంట్రోల్ అధికారులు గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం పారకలపల్లికి చెందిన గిర్నేని గోపాల్(42) 2001లో నగరానికి వలస వచ్చి నిజాంపేట మధురానగర్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లో హరిణి ఇండస్ట్రీస్ పేరుతో ప్లాస్టిక్ మోల్డింగ్ పరిశ్రమ నిర్వహించేవాడు. అయితే కరోనా సమయంలో పరిశ్రమ నడవకపోవడంతో గోపాల్ ఆర్థికంగా చితికిపోయాడు. దీంతో తన మిత్రుడైన ఢిల్లీవాసి నిహాల్‌తో కలిసి నకిలీమందుల తయారీకి తెరలేపాడు.

ఢిల్లీ నుంచే ముడిసరుకులు..

గ్రాన్యులేటెడ్ ట్యాబ్లెట్లు, ప్యాకింగ్ మెటీరియల్స్, లేబుల్స్, అల్యూమినియం స్ట్రిప్ ఫాయిల్స్,ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీల బాక్సులను నిహాల్ ఢిల్లీ నుంచి గోపాల్‌కు పంపేవాడు.మేడ్చల్ జిల్లా దూలపల్లిలో ఓ గోదామును ఏర్పాటు చేసి అవసరమైన యంత్రాలను కొనుగోలు చేశారు. వీరికి జగద్గిరిగుట్ట సంజయ్‌పురి కాలనీకి చెందిన మెషీన్ ఆపరేటర్ రామకృష్ణ(40) తోడయ్యాడు. ముగ్గురు కలిసి ప్రముఖ బ్రాండ్ల పేరిట నకిలీ మందులను తయారు చేయడం మొదలుపెట్టారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న డ్రగ్స్ కంట్రోల్ బోర్డు, ఎస్‌ఓటీ, పేట్ బషీరాబాద్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సామగ్రిని సీజ్ చేశారు. గోపాల్, రామకృష్ణలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తర లించగా, నిహాల్ పరారీలో ఉన్నాడు.విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాస్, ఎస్‌ఓటీ ఏడీసీపీ శోభన్‌కుమార్, ఎస్‌ఓటీ సీఐ శ్యాంసుందర్ రెడ్డి, డ్రగ్స్ కంట్రోల్ అధికారులు పాల్గొన్నారు. కాగా, నకిలీ దందాను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందికి రివార్డు అందజేస్తామని డీసీపీ తెలిపారు.